
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
మంగళవారం 18 మార్చి 2025



స్వాగతం.. సునీతా విలియమ్స్

అంతరిక్షంలో 9 నెలలుగా ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమి మీదకు వస్తున్నారనే విషయం విదితమే. వారు సేఫ్‌గా రావాలని కోరుకుంటూ సిద్దిపేటలోని అంబిటస్ స్కూలు క్యాంపస్‌లో విద్యార్థులు సునీతా వెల్కమ్ టు ఎర్త్ అని అక్షరాల రూపంలో కూర్చుని స్వాగతం తెలిపారు.

- సిద్దిపేట కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని నాన్సాబ్‌గడ్డలో సోమవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. రంజాన్ మాసం కావడంతో ఉపవాసం ముగియగానే ముస్లిం సోదరులకు పండ్లు తినిపించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లింలకు జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని నాన్సాబ్‌గడ్డలో జరిగిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌కు దూరంగా ఉండాలి

- యువత అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు
- సీపీ డాక్టర్ బి.అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు ఆన్‌లైన్ బెట్టింగ్, గెమింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని సీపీ డాక్టర్ బి.అనురాధ సోమవారం ఓ ప్రకటన ద్వారా సూచించారు. ఆన్‌లైన్‌లో బెట్టింగులు పెట్టడం, గేమ్‌లను ఆడటం, గుర్తింపు లేని అంతర్జాల సంస్థల్లో డబ్బు పెట్టుబడుల వల్ల చాలామంది ఆర్థిక నష్టాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ యాప్‌లు చాలా ప్రమాదకరమైనవని, వీటిల్లో ఒక్కసారి చిక్కుకుంటే బయటకు రావడం ఇబ్బంది అవుతుందని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు ఈయాప్‌లకు బానిసలుగా మారొద్దని, అప్పులపాలై ప్రాణాలకు మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు వీటిని ప్రోత్సహించ వద్దని సీపీ కోరారు. ఈ యాప్‌లను ప్రచారం చేస్తే ఎవరిపైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇక ఒకే కార్డుతో ఎక్కడైనా వైద్య సేవలు పొందే సదుపాయం అమలులోకి రానుంది. ఆయుష్మాన్ భారత్ (అభా) కార్డులతో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్‌లోనూ పలు రకాల వైద్య చికిత్స చేయించుకోవచ్చు. అందరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ పేరిట శాశ్వత డిజిటల్ నంబర్‌తో కూడిన అభా కార్డులను ఇవ్వనున్నారు. సమగ్ర ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఇందులో నమోదు చేస్తున్నారు. దీంతో దేశంలో ఏ ఆసుపత్రికి వెళ్లినా అభా కార్డు నంబర్ సహాయంతో అక్కడి వైద్యులు రోగి పరిస్థితి ఇట్టే తెలుసుకుంటారు.



ఆయుష్మాన్ భవ



దుబ్బాకలోని సబ్‌సెంటర్‌లో ఎన్‌సీడీ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది

- డిజిటల్ నంబర్‌తో ఆభా కార్డులు
- ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ వివరాలు
- కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా చికిత్స
- ప్రైవేటులోనూ అందనున్న వైద్య సేవలు
- ఎన్‌సీడీ యాప్ ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియ
- జిల్లాలో ఇప్పటికే 56 శాతం నమోదు

సిద్దిపేట టౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ పేరిట ఇవ్వనున్న ఆభా కార్డులతో రాష్ట్రంలో రూ.10 లక్షల వరకు, ఇతర రాష్ట్రాల్లో రూ.5 లక్షల వరకు వైద్య చికిత్సలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. జిల్లాలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఆయుష్మాన్ భారత్ అధికారిక వెబ్‌సైట్‌లో నేషనల్ హెల్త్ పోర్టల్(ఎన్‌సీడీ) యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రతీ ఒక్కరి వివరాలను నమోదు చేస్తున్నారు.

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్

చిన్న పిల్లల నుంచి పండు ముసలి వరకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ (ఆరోగ్య చరిత్ర)ను ఆన్‌లైన్ ద్వారా చూసేలా వివరాలు త్వరలోనే అందుబాటులో ఉండనున్నాయి. బ్లడ్ గ్రూప్, బీపీ, షుగర్, సంక్రమిత, అసంక్రమిత, ఇతర అనారోగ్య వివరాలను నేషనల్ హెల్త్ పోర్టల్(ఎన్‌సీడీ) యాప్ ద్వారా జిల్లాలోని 38 పీహెచ్‌సీలలో ఆరోగ్య కార్యకర్తలు పూర్తిస్థాయిలో నమోదు చేస్తున్నారు. 14 అంకెలతో అకౌంట్ నంబర్‌ను కేటాయించి, పాన్‌కార్డు తరహాలో ఉండే ఆభా కార్డును ఇవ్వనున్నారు. ఈ కార్డుతో ఆసుపత్రికి వెళ్లితే కార్డుపై ఉన్న నంబరుతో ఆరోగ్య వివరాలను వైద్యుడు తెలుసుకోవచ్చు. దీంతో పేషెంట్‌కు ఏ వ్యాధి ఉంది.. అంతకుముందు అందించిన

మిగతా 8వ పేజీలో

అత్యవసర వేళ బయోమెట్రిక్ ద్వారా

అత్యవసర సమయంలో, ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగి రోగి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు థంబ్ బయోమెట్రిక్ ద్వారా ఆయుష్మాన్ భారత్‌కు చెందిన సాఫ్ట్‌వేర్‌తో వివరాలు లభిస్తాయి. దీంతో వెంటనే ఆ రోగికి కావలిసిన వైద్య చికిత్సలు అందే అవకాశాలున్నాయి. ఈ మేరకు ఆధార్ కార్డు ఆధారంగా అన్నీ వివరాలను ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను తీసేయాలి

- నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం
- విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్



ఫటాఫట్

సిద్దిపేట టౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రైతులు వ్యవసాయబావుల వద్ద వినియోగిస్తున్న ఆటోమేటిక్ స్టార్టర్లను తీసివేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ టీఆర్.చంద్రమోహన్ సూచించారు.

జిల్లాలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లున్నాయి?

జిల్లాలో 5,86,350 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, డొమెస్టిక్ 3,52,800, కమర్షియల్, 44,989, వ్యవసాయం 1,73,360, ఇతర 15,201 విద్యుత్ మీటర్లున్నాయి.

వ్యవసాయరంగానికి పలు చోట్ల త్రీ ఫేజ్ ఇవ్వడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి?

వ్యవసాయరంగానికి సంబంధించి 18 గంటలు త్రీ ఫేజ్, 6 గంటలు సింగిల్ ఫేజ్ నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. రైతులకు ప్రభుత్వ ఉచితంగా సరిపడా విద్యుత్‌ను అందిస్తుండటంతో ఆటోమెటిక్ స్టార్టర్లను తీసివేయాలి. ఐఎస్ఐ మార్కు ఉన్న మోటార్లు బిగించుకోవాలి. ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు త్రీ ఫేజ్ తీసేస్తున్నాం.

వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

వేసవికాలం ప్రారంభం కాగానే విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. 20 శాతం పెరిగే అవకాశం ఉన్నది. జిల్లాలో 180 సబ్‌స్టేషన్లు ఉండగా అక్కడక్కడా విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పరిష్కరించేందుకు కొంత సమయం పడుతుంది. ఉన్నతాధికారుల సూచన మేరకు రూ.45 కోట్లతో మరమ్మతులు చేపట్టాం. పలు సబ్‌స్టేషన్ల పరిధిలో, 33/11 కేవీ మరమ్మతులు నిర్వహిస్తున్నాం. ఇబ్బందులేమైన ఉంటే నా దృష్టికి గానీ, 040-23454884 లేదా 7680901912 నంబర్లకు కాల్ చేసి చెప్పండి.

కమీషన్‌లలో అధికారులకూ వాటా?

- 'అమ్మ' పాఠశాలల బిల్లుల చెల్లింపునకు వసూళ్లు
- కలెక్టర్ ఎదుట కమిటీ చైర్మన్ల ఆవేదనతో బహిర్గతం
- సిబ్బందిపై ఎలాంటి చర్యలు లేవు
- కనీసం విచారణకు ఆదేశించని ఉన్నతాధికారులు

చేర్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన పనుల బిల్లుల చెల్లింపునకు పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది కమీషన్లు దండుకున్నారన్న ఆరోపణలు వినవిస్తున్నాయి. మండలంలోని గురువన్నపేట పాఠశాలలో శనివారం నిర్వహించిన ఏఐ ఆధారిత బోధన ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మనుచౌదరి సమక్షంలో జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలల కమిటీ చైర్మన్లు కమీషన్ల బాగోతంపై తమ గోడును వెల్లబోసుకున్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఏఈ శివ ప్రైవేటుగా నియమించుకున్న సిబ్బంది శ్రీకాంత్‌తో పాటు డీఈ కార్యాలయ సిబ్బంది మాజీద్ బిల్లుల చెల్లించేందుకు రూ.7,500 చొప్పున తీసుకున్నారని, పెండింగ్ బిల్లుల కోసం మరిన్ని డబ్బులు కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ పెండింగ్ బిల్లులను వెంటనే అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కానీ, ఈ వసూళ్లలో అధికారులకు వాటా ఉందా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసూళ్లకు పాల్పడిన సిబ్బందిపై ఉన్నతాధికారులు కనీసం విచారణకు ఆదేశించకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సిబ్బంది కేవలం గురువన్నపేట పాఠశాలల్లోనే కాకుండా మండలంలోని ఇతర పాఠశాలల్లోనూ చేపట్టిన పనుల బిల్లుల విషయంలో ఇదే తరహాలో వసూళ్ల పర్వం కొనసాగించారన్న ఆరోపణలు ఎదుర్కుంటున్నారు. కాస్త ఎక్కువ, తక్కువ కాకుండా వేర్వేరుగా ఒకే మాదిరి వసూలు చేసిన డబ్బుల్లో వాళ్లిద్దరే వాటా పంచుకున్నారా..? వసూలు చేసిన మొత్తాన్ని అధికారులకు కొంత ముట్టజెప్పారా? లేదా అధికారుల పేరు చెప్పి వారే వసూలు చేశారా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా కమీషన్లు దండుకుంటుంటే, పనులు ఎలా చేయగలమని ఇతర గ్రామాల పాఠశాలల్లో పనులు చేపట్టిన మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ల వసూళ్లపై లిఖితపూర్వక ఫిర్యాదుకు సన్నద్ధమవుతున్నారు. కలెక్టర్ ఎదుటనే వసూళ్ల పర్వాన్ని బాహాటంగా చెప్పినా సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవంతో, ఫిర్యాదు చేస్తే తమకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తారా లేదా అని పునరాలోచిస్తున్నారు. ఈ విషయమై చేర్యాల ఏఈ శివను వివరణ కోరగా పనుల పర్యవేక్షణ నిమిత్తం నియమించుకున్న శ్రీకాంత్‌తో పాటు డీఈ కార్యాలయ జేటీవో మాజీద్ డబ్బులు వసూలు చేసిన విషయం తనకు తెలియదనడం గమనార్హం.



కలెక్టర్ మనుచౌదరి సమక్షంలో గోడు వెల్లబోసుకుంటున్న గురువన్నపేట పాఠశాల కమిటీ చైర్మన్ (ఫైల్)

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (మంగళవారం సాయంత్రం) సహర్: 5:00 (బుధవారం ఉదయం)

మల్లన్న ఆలయంలో సీల్డ్‌టెండర్ కమ్ బహిరంగ వేలం



సీల్డ్‌టెండర్ బాక్స్‌ను తెరుస్తున్న ఆలయ సిబ్బంది

చేర్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో సోమవారం ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో పూజా సామగ్రి విక్రయ దుకాణం నంబర్-1 లీజుకు రూ.7 లక్షలు పాట పాడి జి.దశరథం దక్కించుకున్నారు. దుకాణం నంబర్-2కు రూ.6.05లక్షలు హెచ్చు పాట పాడి కె.శ్రీనివాస్ హక్కు పొందారు. టెండర్ ఖరారైన వారికి 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి 31 వరకు లైసెన్స్ హక్కు కలిగి ఉంటారని తెలిపారు. అలాగే, సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ లీజుకు సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కె.జయప్రకాశ్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ మనుచౌదరి
- ప్రజావాణిలో 43 ఫిర్యాదులు

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన సమస్యలను విని, వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ఆర్జీదారులకి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమాఅగ్రవాల్, అబ్దుల్‌హమీద్‌తో కలిసి అర్జీదారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులు తీసుకోవడమే కాకుండా, ఆయా శాఖల అధికారులు వారంలోపు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ప్రజావాణిలో భూసంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 43 ఫిర్యాదులు వచ్చాయి.

- మూడు సంవత్సరాల నుంచి బ్యాకు లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, వెంటనే నియామకాలు చేపట్టాలని దివ్యాంగులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- సిద్దిపేటలోని కేసీఆర్ గుండ్ల చెరువులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ పట్టాలను ఆన్‌లైన్ చేసి ఇవ్వాలని లబ్ధిదారులు ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు.
- కోహెడ మండలంలోని నాగసముద్రాల గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ కోడముంజ రాజు తన భార్య, కుమారుల పేరిట జాబ్‌కార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్ము కాజేసారని గ్రామస్థుడు ఫిర్యాదుచేశారు. అంతేకాకుండా వేరే వారితో విధులను చేయిస్తున్నాడని, రికార్డులను చూపిస్తూ డబ్బులను అక్రమంగా తీసుకుంటున్నారని, రాజుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



సమస్యలను వింటున్న కలెక్టర్ మనుచౌదరి

కాలువలను పూర్తిచేయాలి

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే కేపీఆర్ వినతి

దుబ్బాక, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : 'తలాపున మల్లన్నసాగర్... తడి ఎరుగని నేల' అనే కథనంపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి(కేపీఆర్) సోమవారం స్పందించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' కథనంతో నేరుగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలసి, దుబ్బాక పరిస్థితిని వివరించారు. దుబ్బాక నియోజకవర్గంలోని మైనర్, సబ్‌మైనర్ కాలువలను పూర్తిచేయాలని కోరారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా తమకు అందాల్సిన నీటిని రైతాంగానికి అందించాలన్నారు. పంటలను కాపాడటానికి తక్షణమే మల్లన్నసాగర్ నుంచి 300 వందల క్యూసెక్కుల నీటిని కూడవెల్లి వాగుకు విడుదల చేయాలని కోరారు. రామాయంపేట, చిన్నశంకరంపేట కాలువలకు విడుదల చేయాలని విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మల్లన్నసాగర్ ద్వారా నీటిని విడుదల చేయడానికి ఆదేశాలను ఇచ్చారు. మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లి వాగుకు నీటిని విడుదల చేశారు. అధికారులతో మాట్లాడి, 300 క్యూసెక్‌ల నీటినే కాకుండా అవసరమైన నీటిని సాగుకు అందించి, పంటలను కాపాడాలని అధికారులను ఆదేశించారు. వెంటనే స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే కేపీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధం

● వెల్దుర్తి మండలం ధర్మారంలో ఘటన

వెల్దుర్తి, మార్చి 17 ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంలో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మర్కంటి రుక్కమ్మ, భర్త సాయిలు గుడిసెలో నివాసముంటున్నారు. సోమవారం ఉదయం ప్రమాద వశాత్తు గుడిసెలో విద్యుదాఘాతం ఏర్పడి ఇంట్లోని వంట సామగ్రి, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సూమారు రూ.25 వేల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం తరఫున తమకు ఆర్థిక సాయం చేసి అందజేయాలని బాధితుడు, గ్రామస్థులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఏడుగురి ఆత్మహత్య



ఇమామ్ (ఫైల్)

చిలప్‌చెడ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాకోసం చేసిన అప్పులు అధిక మవడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన దూదేకుల ఇమామ్(46) రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. కాగా అప్పులను తీర్చడానికి 6 నెలల క్రితం భార్య ఫాతిమా, పిల్లలు సల్మాన్, సోని యాలతో కలిసి హైదరాబాద్‌లోని హఫీజ్‌పేటకు బతుకుదెరువుకు వెళ్లాడు. 8 రోజుల క్రితం ఇమామ్ గ్రామానికి వచ్చి వెళ్లాడు. 15వ తేదీ రాత్రి కుమారుడు సల్మాన్‌తో మాట్లా డిన తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. 16వ తేదీ రాత్రి 8 గంటలకు భార్య ఫాతిమా మృతుడి సోదరుడు గౌస్‌కు ఫోన్‌చేసి చూడమని తెలిపింది. అక్కడికి వెళ్లేసరికి ఇమామ్ ఉరేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆర్థిక పరిస్థితులు.. జీవితంపై విరక్తితో ఇద్దరు



పురుషోత్తం(ఫైల్)



ఇమామ్(ఫైల్)

సంగారెడ్డి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రామాయం పేట మండలం ధర్మారం, వెంకటాపూర్ గ్రామాల్లో ఇరు వురు యువకులు బలవన్మ రణం చెందారు. ధర్మారం గ్రామానికి చెందిన పురు షోత్తం(34) ఆదివారం పొలానికి వెళ్లి రాత్రివరకు తిరిగి రాలేదు. దీంతో భార్య భాగ్య కుటుంబీకుల సహాయంతో పొలం వద్ద వెతకగా చెట్టుకు ఉరివేసు కుని కనిపించాడు. ఆర్థిక పరిస్థితులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. అలాగే వెంకటాపూర్ గ్రామానికి చెందిన షుర్ర రాములు(36) ఈ నెల 11న ఆర్థిక సమస్య కారణంగా ఇంట్లోనే గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరగా కుటుంబీకులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున చనిపోయినట్లు ఎస్ఐ తెలిపారు.

వేధింపులు భరించలేక మహిళ..

నారాయణఖేడ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త, మామ చేసిన వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని భీంరాలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజ య్‌కుమార్ వివరాల ప్రకారం.. కంగ్టి మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన పోగుల సుజాత, రవీందర్‌రెడ్డిల రెండో కూతురు మహేశ్వరికి భీంరా గ్రామానికి చెందిన బొండ్ల పండరిరెడ్డితో మూడేళ్ల క్రితం వివాహ మైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నిరోజులుగా భర్తతో పాటు బావమ, మామ అదనపు కట్నం తేవాలని మహేశ్వరిని వేధిస్తున్నారు. ఈ వేధింపులు భరించలేక సోమవారం ఉదయం ఇంట్లో దూలానికి ఉరేసు కుని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా సంఘటనా స్థలాన్ని ఖేడ్ డీఎస్పీ సందర్శించారు.

మద్యానికి బానిసై యువకుడు..

కంది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ వివరాల ప్రకారం.. కంది మండలం చిమ్నాపూర్‌తండాకు చెందిన బానోత్ అంబర్‌సింగ్(25) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గతేడాది పెళ్ల యినా అతడు తాగుడు మానలేదు. ఆదివారం రాత్రి మద్యం సేవించి చిమ్నాపూర్ తండా పరిధిలోని ధర్మాసాగర్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు సోమవారం ఉదయం మృతదేహాన్ని చెరువు లోంచి బయటకుతీశారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

సంగారెడ్డి క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని మంజీరా వద్ద సోమవారం జరిగింది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ పీ.రవీం దర్ తెలిపిన వివరాల ప్రకారం.... సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామా నికి చెందిన బైండ్ల యాదయ్య(50) శివారులోని మంజీరా వంతెన కింద చేపలు పట్టేందుకు 16న వెళ్లాడు. కుటుంబసభ్యులు మంజీరా నదిలో వెతి కినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమ వారం నదిలో మృతదేహం తేలింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

● యువకుడి దుర్మరణం, ఒకరికి తీవ్రగాయాలు

చేగుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌ను, లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నార్సింగి మండలం వడ్డెర కాలనీ 44వ జాతీయ రహదారి వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్ఐ అహ్మద్ మొహినుద్దీన్ వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన బోస్ ప్రభాస్(18) వడ్డెర కాలనీ నుంచి ట్రాక్టర్ పై రాయి కొట్టడానికి కూలీ పనికి బాబాయి అశోక్‌తో వెళ్తు న్నాడు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న లారీ ట్రాక్టర్‌ను వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బోస్ కిందపడడంతో అతని పైనుంచి ట్రాక్టర్ బోల్తాపడి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'ఎంఎన్ఆర్'ను తనిఖీ చేసిన రాష్ట్ర వైద్య బృందం



ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫసల్‌వాది శివారులోని ఎంఎన్ ఆర్ మెడికల్ కళాశాల, హాస్పిటల్‌ను క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ స్టేట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్స ధరలు పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరుపై ఆరా తీశారు. స్కానింగ్ సెంటర్ల ఫారం ఎఫ్ తనిఖీలో భాగంగా ఆన్‌లైన్, మాన్యువల్ తేడాలను గమనించారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి అంతర్జాతీయ సహకారం

● ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



జర్మనీ వర్సిటీల అధ్యాపక బృందంతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పరిశోధన విద్యాభివృద్ధి కోసం అంతర్జాతీయ సహకారం అవసరమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి అన్నారు. జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్ నుంచి ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం విద్యా, పరిశోధన సహకారాలను చర్చించడానికి 18 మంది సభ్యుల జర్మన్ ప్రతినిధుల బృందం డిల్లీ, హైదరాబాద్‌లను సందర్శించింది. ఈ నేపథ్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌ను సందర్శించింది. కార్యక్రమానికి డీఏఏడీ (డ్యూషర్ అకాడెమిషర్ ఆస్టాష్డియెన్స్ట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ క్రైసిక్స్, జర్మన్ కాన్సులేట్ చెన్నై కాన్సుల్ జనరల్ కాథరిన్ మిసెరా-లాంగ్, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి నాయకత్వం వహించారు. ఇరువురు ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు.

సద్దిమూట శతక పుస్తకావిష్కరణ



సద్దిమూట శతకాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కమిషన్ సభ్యురాలు మరికంటి భవానీ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి తదితరులు

చేర్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఐనాపూర్ జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు ఎండీ సయ్యద్ రచించిన సద్దిమూట శతక పుస్తకాన్ని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యురాలు మరికంటి భవానీ, మాజీ జడ్పీ చైర్మన్ వేలేటి రోజారాధాకృష్ణ ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు, సమాజానికి బుద్ధిబాటలు వేయడంతో సద్దిమూట శతకం తోడ్పడుతుందని, నిజ జీవితసమస్యలను కథావస్తువుగా వినియోగించడం అభినందించదగిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ శ్రీరాముల లక్ష్మి, రంగనాయకసాగర్ రచయితల సంఘం అధ్యక్షుడు పిన్నింటి మహేంద్ర, మాజీ సర్పంచుచెరుకు రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేచర్ ఐకాన్ యూత్ సంస్థకు అవార్డు

మనోహరాబాద్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అతిపెద్ద సీఎస్ఆర్ సమ్మిట్- 2025 పురస్కారాల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళ వేదికలలో నిర్వహించిన కార్యక్రమంలో నేచర్ ఐకాన్ యూత్ సంస్థకు గ్రామీణ అభివృద్ధి పురస్కారం అవార్డు లభించింది. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన నేచర్ ఐకాన్ యూత్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రతి ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం 300 పైగా వారాల పాటు నిర్వహించారు. దీంతో నేచర్ ఐకాన్ యూత్ సంస్థను అవార్డుకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి, విశ్రాంత ఐఏఎస్ అధికారి తేజావత్ రామచంద్ర సోమవారం అవార్డును ప్రదానం చేశారు.

గౌడిగూడెం ఇసుక ఫిల్టర్లపై దాడులు

● పోలీసుల అదుపులో నిందితుడు

తూప్రాన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌడిగూడెం శివారులోని అక్రమ ఇసుక ఫిల్టర్ల నిర్వహణపై సోమవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. తూప్రాన్ ఎస్సై శివానందం ఆధ్వర్యంలో సిబ్బంది పెద్ద ఎత్తున దాడులు చేశారు. అక్రమం ఇసుక ఫిల్టర్ల వద్ద ఉన్న ఒక హిటాచీ, ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాడుల్లో అక్రమ ఇసుక ఫిల్టర్ నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, హిటాచీ, ఎక్స్‌వేటర్, ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు. కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

ముస్తాబైన నాచగిరి





రేపటి నుంచి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు

వర్గల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర హరిద్రా నది తీరాన, ఆహ్లాద కరమైన వాతవరణం, చుట్టూ పచ్చని పంట పొలాలు, సహజ సిద్ధమైన ఎత్తైన కొండ గుహలలో కొలువైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయం నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు జరగనున్నాయి. నాచగిరి లక్ష్మీనృసింహస్వామివారి క్షేత్రంలో జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ తెలిపారు.

భారీ ఏర్పాట్లు

ఉత్సవాల కోసం నాచగిరి క్షేత్రంలోని తొమ్మిది ఉపలాయాల్లోనూ అన్ని ఏర్పాట్లు చేశారు. నాచగిరి క్షేత్రంలోని ఆలయాలు సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలు, ప్రాంగణమంతా రంగులతో మెరుగులు దిద్దారు. స్వామివారిని భక్తులు దర్శించుకునే విధంగా క్యూలను భారీస్థాయిలో ఏర్పాటు చేశారు. క్షేత్రంలో అక్కడక్కడ తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. తూప్రాన్, గజ్వేల్, సిద్దిపేట వెళ్లే రాజీవ్ రహదారి ప్రజ్ఞాపూర్ వద్ద వెళ్లే రహదారిపై భారీ స్థాయిలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బ్రహోత్సవాల సందర్భంగా ప్రాంతమంతా రక రకాల దుకాణ సముదాయాలు ఏర్పాటైనాయి. చిన్నారుల కోసం రంగుల రాట్నం, సర్కస్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాలలో తాత్కలిక స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

హుండీ ఆదాయం రూ.15.42 లక్షలు

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించారు. నాచగిరి క్షేత్రంలో 88 రోజులకుగాను నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ. 15,42,922 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. విశ్వనాథశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుధాకర్, పాండు, నరేందర్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన భ్రమరాంబిక సేవా సమితి, శివకేశవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులు

నాచగిరి నృసింహస్వామి క్షేత్రంలో బ్రహోత్సవాల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. మేడ్చల్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్, హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి నాచగిరి క్షేత్రం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతారు.



నేటి నుంచి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని శ్రీ మహారేణుక ఎల్లమ్మదేవి ఆలయ 49 వార్షికోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక్కడ కొలువైన అమ్మవారు పూర్తిగా శాఖహర నైవేద్యాలనే సమర్పిస్తారు. అందుకే అమ్మవారిని బ్రహ్మణింటి ఎల్లమ్మగా పిలుస్తారు. ఏటా వార్షికోత్సవాలు, ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఆలయంలో సిద్దోహం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు 49వ వార్షికోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. మొదటి రోజు మంగళవారం అమ్మవారికి అభిషేకంతో పాటు విశేష పూజ కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం పట్టణ పురవీదుల్లో అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగుతుంది. రెండవ రోజు బుధవారం ప్రత్యేక పూజలతో పాటుగా అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. చివరి రోజు గురువారం అమ్మవారి జప తప పూజాధికాలతో పాటుగా మహా చండీ హవనం నిర్వహిస్తారు. భక్తులకు యజ్ఞ ప్రసాద వితరణ చేపడతారు. ఈ మూడు రోజుల పాటు భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుంది. పట్టణ ప్రజలే కాకుండా ఇతర చోట్ల నుంచి కూడా భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆలయ వార్షికోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు లాల్ బహదూర్ తెలిపారు.

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో..



గుమ్మడిదల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రెండు వందల యేళ్ల చరిత్ర ఉన్న బొంతపల్లి శ్రీ భద్రకాళి సహిత వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మద్ద ప్రతాప్ ఎరెడ్డి, కార్యనిర్వహణాధికారి శశిధర్ గుప్తా తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రజలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. దీంతో ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు వేయడంతో పాటు, వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



ఎండిన పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు

సింగూరు నీటిని విడుదల చేయాలి లేదంటే.. గేట్లు బద్దలు కొడుతాం

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పుల్‌కల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ వరి పొలాలకు వారం రోజుల్లో సింగూరు జలాలను విడుదల చేయకపోతే మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో రైతులను వెంటబెట్టుకుని సింగూరు ప్రాజెక్టును ముట్టడించి, గేట్లు బద్దలు కొడుతామని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హెచ్చరించారు. మండలంలోని ఉమ్లానాయక్, హన్మానాయక్ గిరిజన తండాలలో సాగవుతున్న వరి, జొన్న పంటలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల జైపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సింగూరు ఎడమ కాలువ ఆధునికీకరణ పేరుతో నీటి పారుదల శాఖ అధికారులు ఖరీఫ్, యాసంగి సీజన్లను క్రాప్ హాలీడేగా ప్రకటించి రైతుల నోట్లో మట్టికొట్టారని ఆరోపించారు. గ్రామాలలో ఎలాంటి చాటింపు, దండోరా వేయకుండా ఇష్టానుసారంగా క్రాప్ హాలీడే ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, నాయకులు ఎర్రోల్ల పోచయ్య, తుంగె అనంతి, దేవీసింగ్ తదితరులున్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

రెండు రోజులుగా ధర్నా

కాంగ్రెస్ నేత హామీతో విరమణ



ఆందోళనకు దిగిన రైతులతో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పంట పొలాలకు సాగునీటిని అందించాలని పలువురు రైతులు గజ్వేల్-చేగుంట జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చందాయిపేట, కసంపల్లి, నర్సంపల్లి, మాచిన్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు ఇందుప్రియల్ కెనాల్ వద్ద, సోమవారం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. తాము ఎర్రటిఎండలో రెండు రోజులుగా ధర్నా చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంట పొలాలకు సాగునీటిని అందించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇరిగేషన్ డీఈతో కలిసి వచ్చి రైతులతో మాట్లాడారు. మాచిన్‌పల్లి, ఇందుప్రియ ల్ వద్ద అడవిలో నుంచి కాలువ నిర్మాణం పూర్తి చేసి ఆయా గ్రామాలకు సాగునీటికి సమస్య లేకుండా శాశ్వ త పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఈ విష యాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి యాసంగి సీజన్‌లో సాగునీటిని అందించేందుకు ప్రయ త్నిస్తానని చెప్పారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కాంగ్రెస్ నాయకులు మద్దెల స్వామి, నవీన్, శ్రీకాంత్, ప్రణయ్, వెంగళరావు, తదితరులు ఉన్నారు.

మా పంటలెండిపోతున్నాయ్..

మద్దూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి లద్నూరు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ సోమవారం రిజర్వాయర్ వద్ద లద్నూరు గ్రామ రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్‌ను నమ్ముకుని పంటలు సాగు చేశామని, ఎండల కారణం గా భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మకూరు రిజర్వాయర్‌లోకి నీటిని నింపుతున్న క్రమంలో లద్నూరు రిజర్వాయర్‌ను నింపి కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంటల్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లద్నూర్ రిజర్వాయరే తమకు దిక్కు అని ఈ సందర్భంగా రైతులు పేర్కొన్నారు. పంటల సాగుకు వేలల్లో పెట్టుబడులు పెట్టామని, కళ్లముందే పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మకూరు రిజర్వాయర్ నిండగానే లద్నూరు రిజర్వాయర్‌లోకి నీటిని అందిస్తామని ఇరిగేషన్ ఏఈ వెంకన్న, డీఈ శ్రవణ్‌కుమార్ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ కనకరాజు, రైతులు నంద శ్రీను, ఆదాం, రాజు పలువురు పాల్గొన్నారు.

రేపు 'దేవాదుల' నీటి విడుదల : ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గ రైతులకు సాగునీటిని అందించేందుకు దేవాదుల మూడో దశ నీటి విడుదలను రేపు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని సక్రమంగా అందించకపోవడంతో రూ.600 కోట్ల మేర పంట నష్టం వాటిల్లిందని, వెంటనే పంపులు ఆన్‌చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో మూడవ దశను ప్రారంభిస్తున్నట్లు ఆయన సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదుల పరిధిలోని తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూరు రిజర్వాయర్లను నింపి నియోజకవర్గంలోని ఆయకట్టుకు సాగునీరందించాల్సిన ప్రభుత్వం పట్టించకోలేదన్నారు. నాట్లు అయిపోయి నీళ్లకోసం అన్నదాతలు తండ్లాడుతుంటే అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడంతో పంటలు ఎండిపోయాయన్నారు. 34 రోజులపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది ధర్నా చేసినా పట్టించుకోలేదని, 60రోజుల్లో 40 రోజులే పంపులు నడపడం శోచనీయమన్నారు. జనగామ నియోజకవర్గంలో 50శాతంపైగా పంటలు ఎండిపోయాయని, బాధిత రైతులు గోడువెళ్లబోసుకున్న విషయాన్ని కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారులతోపాటు మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో దేవన్నపేట నుంచి ధర్మసాగర్‌కు వచ్చే థర్డ్ ఫేస్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో మోటార్లను ఆన్‌చేసి రిజర్వాయర్లు, చెరువులను నింపి పంటలను కాపాడాలని, నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతానన్నారు.




ఆత్మహత్య చేసుకున్న తల్లిదండ్రుల అంత్యక్రియలు నిర్వహిస్తున్న చిన్నారులు

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

తొగుట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్న భార్యాభర్తల అంత్యక్రియలు ఎల్లారెడ్డిపేటలో సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకోవడంతో వారి నలుగురు పిల్లలు రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. తల్లిదండ్రులు లేక ఆ చిన్నారులు దిక్కులేని పక్షుల్లా మారారు. వారి రోదిస్తుంటే.. వారించడం ఎవరి వల్ల కాలేదు. అంతిమ సంస్కారాలకు సైతం డబ్బులు లేకపోవడంతో దాతలు ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లితండ్రులకు వేర్వేరుగా ఇద్దరు తనయులు అంతిమ సంస్కారాలు చేపట్టడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. అంత్యక్రియలకు నాయకులు, గ్రామస్థులు భారీగా తరలివచ్చారు. చిన్నారుల భవిష్యత్‌పై చర్చించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తొగుట కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి, మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్యలు పాడె మోశారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య



సాయి(ఫైల్)

బెజ్జంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బెజ్జంకి మండలం నరసింహులపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నరసింహులపల్లి గ్రామానికి చెందిన కుసుంబ సాయి (22) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. సాయి సుమారు ఐదు సంవత్సరాల నుంచి దగ్గు, దమ్ము, కడుపునొప్పితో బాధపడుతుండటంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చూపించారు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలు ఎక్కువడంతో వ్యవసాయ బావి వద చెట్టుకు ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన అక్కడి వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు సాయిని బెజ్జంకి ఆస్పత్రికి, అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సాయి మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.



పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన అమీన్‌పూర్ కూరగాయల మార్కెట్

అమీన్‌పూర్

● అభివృద్ధి పనులకు నిధుల గ్రహణం ● పిల్లర్ల స్థాయిలో కూరగాయల మార్కెట్
● కలగానే ఇండోర్ స్టేడియం ● రాక్ గార్డెన్‌కు నిధుల కొరత

అమీన్‌పూర్, 17 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ జనాభా సుమారు 60 వేలు. పేరులో ఉన్నట్లుగానే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పేద స్థితిలో ఉంది. లక్షల్లో పన్నులు వసూలవుతున్నా.. నిధులు లేక ఏళ్లగా పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. పేరుకు అతిపెద్ద మున్సిపాలిటీ అయినా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వందలాది కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లతో నిండి ఉన్న మున్సిపాలిటీలో కనీసం కూరగాయల మార్కెట్ లేకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం.

మూడేళ్ల క్రితం పునాదులు

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో మూడేళ్ల క్రితం 6.40కోట్ల అంచనాతో మూడెకరాల విస్తీర్ణంలో కూరగాయలు, మాంసం మార్కెట్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పిల్లర్లు, ప్లింత్ బీంల వరకు పనులను పూర్తి చేశారు. రాష్ట్ర పబ్లిక్ హెల్త్ శాఖ నుంచి నిధులు మంజూరు చేయాల్సి ఉండగా, మూడేళ్లుగా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పాత అమీన్‌పూర్ మున్సిపల్ పాలకవర్గం సైతం అనేక మార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందన కరువైంది. ప్రారంభించిన పనుల్లో పిల్లర్లకు వేసిన స్టీల్ వర్షానికి, ఎండకు తడిసి తుప్పు పట్టిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నియోజకవర్గంలోని తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలలో సైతం మార్కెట్‌యార్డ్‌ల పరిస్థితి ఇలాగే ఉంది.

మినీ స్టేడియం, రాక్‌గార్డెన్ పనుల ఊసే లేదు...

ఏడాదికి సుమారు రూ. 60 కోట్ల ఆదాయం ఉన్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో రూ. పది కోట్ల వ్యయం అయ్యే పనులు సైతం ఏళ్ల తరబడి నిలిచిపోయాయి. మూడేళ్ల క్రితం మున్సిపల్ పాలకమండలి ఐదు ఎకరాల విస్తీర్ణయంలో మినీస్టేడియం కోసం చేసిన శంఖుస్థాపన శిలాఫలకానికే పరిమితం అయింది. సుమారు కోటి రూపాయల సీఎస్ఆర్ నిధులతో గుట్టలు, రాళ్ల చదును చేసేందుకు వెచ్చించారు. మున్సిపల్ ఫండ్ నుంచి కేటాయించాల్సిన నిధులకు ఉన్నతాధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంలేదు. మినీ స్టేడియం పనులకు నిధులు లేకపోవడంతో కనీసం షటిల్ స్టేడియం ఏర్పాటు కోసం రూ. 50 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఇందుకు అనుమతులు రాలేదు. మినీ స్టేడియం పక్కనే మూడెకరాల విస్తీర్ణంలో రెండున్నర కోట్ల అంచనాతో నిర్మించ తలపెట్టిన రాక్‌గార్డెన్‌కు సైతం నిధుల గ్రహణం పట్టుకుంది. రాక్‌గార్డెన్ నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన నిధుల్లో ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని అమీన్‌పూర్ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

నిధుల మంజూరులో జాప్యం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయిన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మార్కెట్ యార్డ్, రాక్‌గార్డెన్, మినీస్టేడియం పనులు ప్రారంభించేందుకు కావాల్సిన నిధులు మంజూరు జరిగేలా చూస్తున్నాం. ప్రాధాన్యత క్రమంలో నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నాం.

- జ్యోతిరెడ్డి,
మున్సిపల్ కమిషనర్

రేకుల షెడ్డుకు పన్ను రూ. 5 వేలా?

హుస్నాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కూలిపోయే రేకుల షెడ్డులో ఉంటున్న తమకు రూ.5 వేల ఇంటి పన్ను విధించారని హుస్నాబాద్ మున్సిపల్‌లోని 20వ వార్డుకు చెందిన కవ్వ ఇందిరా స్థానిక విలేకరుల ఎదుట వాపోయింది. దీనిని రివైజ్ చేసి ఇంటి పన్ను తగ్గించాలని ఆమె కోరింది. ప్రతి సంవత్సరం ఇంటి పన్ను చెల్లిస్తున్నా రసీదులు ఇవ్వడం లేదని బాధితురాలు ఆరోపించింది. పట్టణంలో తనలాగే చాలా మందికి ఇంటి పన్నులు అధికంగా వస్తున్నాయని ఆమె వివరించారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: ఆర్డీవో

గజ్వేల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటుహక్కు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు ఏవైనా ఉంటే చేసుకోవచ్చన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకే ఏఐ ల్యాబ్

మద్దూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల శక్తి సామర్థ్యాల పెంపు కోసం ఏఐ ల్యాబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ బేతి భాస్కర్ తెలిపారు. సోమవారం మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక ఉన్నత పాఠశాలతో పాటు గాగిళ్లాపూర్, నర్సాయపల్లిలోని పాఠశాలల్లో ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ను స్థానిక ఎంఈవో వరదరాజుతో కల్సి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖరశర్మతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

కుకునూరుపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలకు వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గత కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ముత్యాల నరసింహులు మరణించడంతో మృతుడి కుటుంబానికి రూ.2లక్షల ప్రమాదబీమా మంజూరైంది. ఈ మేరకు చెక్కును బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో దేవి రవీందర్, కోల సద్గుణ అమరేందర్, కోల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో కార్మికుల కుటుంబాలు ఆగమ్యగోచరమౌతున్నాయని పంచాయతీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల కుటుంబాలకు బరోసా కల్పిస్తారని ఆశిస్తే 5 నెలలుగా వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి వేతనాలు వెంటనే చెల్లించాలని, లేదా ఆందోళన చేపడతామన్నారు.

విద్యార్థుల ఆరోగ్య రక్షణకు చర్యలు

వర్గల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పూర్తి ఆరోగ్యంగా ఉండేలా కళాశాలల్లో చర్యలు తీసుకుంటున్నట్టు మహాత్మా జ్యోతి బాపూలే మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం భాస్కర్‌రావు అన్నారు. ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులు ఆరోగ్య రక్షణపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుష్టికరమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లెదుటే గోదారి నీరు..
పంటలకు అందని తీరు

- జలాశయాలున్నా ఫలితం శూన్యం
- అర్ధాంతరంగా కాలువల నిర్మాణం.. నిండని చెరువులు
- పలు గ్రామాల్లో ఎండుతున్న పంటలు
- పంటలను కాపాడుకోలేక పశువులను వదులుతున్న రైతులు



నీరు లేక బోసిపోయిన తపాస్‌పల్లి కాలువ, ఎండుతున్న పొలంలో పశువులు, మేకలను వదిలిన రైతులు

కొండపాక, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా మండలంలోని రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జలాశయాలను ఏర్పాటు చేసిన తర్వాత ఇక ఆ ఇబ్బందులు ఉండబోవని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగిలింది. మండువేసవిని తలపిస్తున్న ఎండల కారణంగా సాగుచేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. కళ్ల ముందు గోదారి నీరు కనబడుతున్నా తమ పంటలకు మాత్రం సాగునీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువులకందని 'తపాస్‌పల్లి' నీరు

2017లో చొక్కారావు ఎత్తిపోతల పథకంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి డీ-4 కెనాల్ ద్వారా కొండపాక మండలానికి గోదావరి జలాలు విడుదల చేశారు. దీంతో కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, మర్పడగ, దుద్దెడ, జప్తినాచారం, ఖమ్మంపల్లి, గ్రామాల్లోని చెరువులు నిండాయి. ఇలా ఏటా వేసవిలో సైతం నిండుకుండలను తలపించేవి మండలంలోని చెరువులు. గత ఏడాది వరకు తపాస్‌పల్లి గోదావరి జలాలు అందేవి. కానీ ఈసారి డి-4 కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయలేదు. దాంతో చెరువులన్నీ మట్టి పట్టాయి. కాలువలు బోసిపోయాయి. పంటలన్నీ ఎండిపోతున్నాయి. డి4 కెనాల్ వద్ద ప్రత్యామ్నాయంగా ఓ గేటును మండలానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ ఏర్పాటు చేయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

మూడు గ్రామాలకు కాలువలు లేక..

కొండపాక మండలానికి తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీరు పంపించడానికి కాల్వల నిర్మాణం చేపట్టారు. కానీ మండలంలోని మర్పడగ వరకే కాల్వల నిర్మాణం పూర్తయింది. వివిధ కారణాలతో మర్పడగ నుంచి బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి గ్రామాల వరకు నిర్మించాల్సిన కాలువ అర్ధాంతరంగా ఆగిపోయింది. అధికారులకు, ప్రభుత్వానికి ఆయా గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. గ్రామం పక్క నుంచే ఇతర ప్రాంతాలకు కాలువల ద్వారా నీరు వెళ్తున్న తమ గ్రామాలకు సాగునీరు అందడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంకిరెడ్డిపల్లి గ్రామం శివారు నుంచి చేర్యాల మండలానికి వెళ్లే కాలువ నిర్మాణం జరిగి నీరు సరఫరా అవుతుంది. ఇక్కడి నుంచి కాలువల నిర్మాణం చేపట్టినా కనీసం అంకిరెడ్డిపల్లి, బందారం గ్రామాల చెరువులైనా నిండేవని వాపోతున్నారు. బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వేసిన పంటలన్నీ ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో చేతికొచ్చిన పంట నీరందక ఎండుముఖం పట్టడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు పశువులను, మేకలను వదులుతున్నారు.

బోర్లు ఎన్ని వేసినా...

పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక ఎండిపోయే పరిస్థితి దాపురించిందని పెట్టుబడులకు వెనుకంజ వేయకుండా బోర్లు వేసినా ఫలితం దక్కడం లేదు. 500 నుంచి 1000 ఫీట్ల వరకు బోరు వేసినప్పటికీ నీరు రావడంలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. కాలువల ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.



ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి



దుబ్బాకలో తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశకార్యకర్తలు

సిద్దిపేట రూరల్/దుబ్బాక/మిరుదొడ్డి/తొగుట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాలోని పలు మండలాల్లో అధికారులకు ఆశ వర్కర్లు సోమవారం వినతిపత్రాలను సమర్పించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తూనికి మహేష్ డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తూనికి శ్రీకాంత్, ఆశవర్కర్లు బిట్ల శ్రీలత,సావిత్రి, శోభ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి, తొగుట మండల తహసీల్దార్లకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తిచేసిన ఆశవర్కర్లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.



కొమురవెల్లి శివారులోని డంపింగ్ యార్డులో సోమవారం రాత్రి చెత్తకు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలు ఆర్పారు. -చేర్యాల, మార్చి 16

పనుల పురోగతిపై డీఎంహెచ్‌వోకు నివేదిక

మద్దూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పీహెచ్‌సీల్లో నత్తనడకన సాగుతున్న పునరుద్ధరణ పనులపై జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారికి నివేదిక అందించనున్నట్లు హుస్నాబాద్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఆనంద్ తెలిపారు. 'పీహెచ్‌సీ పునరుద్ధరణ పనులకు మోక్షమెన్నడో?' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో స్పందించారు. ఈ మేరకు మద్దూరు, లద్నూరు పీహెచ్‌సీలను సందర్శించారు. ఆస్పత్రులకు ఏ సమయంలో ఎన్ని నిధులు మంజూరయ్యాయి. పనులు ఏ మేరకు కొనసాగాయి అనే వివరాలను స్థానిక వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చూడాలని ఫోన్‌లో గుత్తేదారుకు సూచించారు అంతకు ముందు సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుబాటులో ముగ్గురు వైద్యాధికారులు ఉండాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆస్పత్రిలో నిర్వహించిన పనుల పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్,మార్చి 17(ఆంధ్రజ్యోతి);దశలవారీగా నిధులు మంజూరు చేయిస్తూ సిద్దిపేట నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ హామీ ఇచ్చారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి, రాఘవాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కింద మంజూరై సీసీ రోడ్లకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు, నాయకులు ఉన్నారు.

దుబ్బాక అభివృద్ధికి కృషి

● కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, మార్చి17(ఆంధ్రజ్యోతి): దుబ్బాక సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం దుబ్బాక మండలం రఘోత్తంపల్లిగ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా 20లక్షల నిధులతో సిమెంట్ రహదారులు, మురికికాలువల పనులను ఆయన ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినప్పటికీ ఆర్థిక వనరులను సమీకరించుకుంటూ, ప్రజాసంక్షేమాలను రేవంత్‌రెడ్డిప్రభుత్వం అందిస్తుందన్నారు.

భజనమండలి సభ్యులకు
శాలివాహన భక్త సమాజం సన్మానం

హుస్నాబాద్‌రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన శివరామకృష్ణ భజన మండలి సభ్యులకు హుస్నాబాద్ నియోజక వర్గ శాలివాహన భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హుస్నాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏ భక్తి కార్యక్రమమైనా పుణ్యప్రదేశాల్లో భజనమండలి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టి భక్తులను ఆకట్టుకుంటున్నారు. శాలివాహన నియోజకవర్గ నాయకులు కానుగుల మోహన్ ఆధ్వర్యంలో భజన కళాకారులకు సన్మానం చేశారు.

మిరుదొడ్డిలో సామాజిక తనిఖీ

మిరుదొడ్డి,మార్చి17(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డిలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు జాతీయ ఉపాధి హామీ పథకంపై 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని అడిషనల్ పీడీ బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రూ.4కోట్ల 23వేల విలువైన ఉపాధి పనులు జరిగాయని వెల్లడించారు. ఆడిట్‌లో భాగంగా బాధ్యులకు 2.03లక్షల జరిమానాను విధించారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, క్యూసీ సంతోష్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ గంగరాజు, ఎంపీడీవోలు తదితరులున్నారు.

'ఆయుష్మాన్'భవ

(5వ పేజీ తరువాయి)

వైద్య చికిత్సలేమిటి అనేవి స్పష్టంగా తెలుసుకునేలా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. రాష్ట్రం దాటి ఎక్కడికైనా వెళ్లినప్పుడు హటాత్తుగా ఏదైనా సమస్య తలెత్తినా ఆభా కార్డు ద్వారా దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవలు పొందే అవకాశముంది. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ లభించనున్నాయి.

56 శాతం రోగుల వివరాలు నమోదు

గతేడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మందకొడిగానే సాగుతున్నది. దేశ వ్యాప్తంగా ఒకే సర్వర్ కావడంతో వివరాలను నెమ్మదిగా నమోదు చేస్తున్నారు. అప్పుడప్పుడు సర్వర్ మొరాయిస్తుండంతో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఎన్‌సీడీ యాప్ ద్వారా వివరాలు నమోదుకు కష్టపడుతున్నారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 10,11,361 మంది జనాభా ఉన్నట్లు గుర్తించిన వైద్యశాఖ అధికారులు 5,61,953 మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి 14 అంకెలు గల నంబర్‌ను కేటాయించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆభా కార్డు విషయమై వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశాలివ్వడంతో వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా..



మిరుదొడ్డిలో పరీక్షా సామగ్రిని అందజేస్తున్న మెదక్ ఎంపీ

మిరుదొడ్డి,మార్చి17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చునని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. సోమవారం మిరుదొడ్డిలో సంకల్ప సేవాఫౌండేషన్, ఎస్ఆర్‌కే ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఎంపీ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్‌బాబు, బీజేపీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు అమర్, నాయకులు ఉన్నారు.

● సిద్దిపేట రూరల్: నేడు అక్షరాలు నేర్చుకుంటేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలకు డిక్షనరీలు అందించడంలో సహకారం అందించిన ప్రముఖ సైకాలజిస్టు హిప్నో పద్మా కమలాకర్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మా రెడ్డి మధుసూదన్ రెడ్డిలను రవీందర్‌రెడ్డి అభినందించారు.

● నంగునూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ హైస్కూల్లో చదివే విద్యార్థులకు సోమవారం కేవీఆర్ ఫౌండేషన్ సహకారంతో పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జి పప్పు రాజారెడ్డి , వెంకట్ మిత్ర బృందంతో కలిసి పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు.

● ములుగు: విద్యార్థుల అభివృద్ధి కోసం స్థానిక నాయకులు ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని మేరీ స్వర్ణకుమారి అన్నారు. సోమవారం ములుగు మండలం సింగన్నగూడ పాఠశాలలో స్థానిక మాజీ సర్పంచ్ బొల్లేపల్లి బాలకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ స్వామి గౌడ్‌లు రూ.26వేల విలువైన ఫర్నిచర్ బెంచీలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రహీమ్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ శ్రీరాంచందర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ధూళిమిట్ట: మండలంలోని రెడ్యానాయక్ తండాలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన ధరావత్ నరేష్ నాయక్ సొంత ఖర్చులతో స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తహశీల్దార్ మధుసూదన్ పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు

నంగునూరు/మద్దూరు: పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని నంగునూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం గొట్టిపర్తి రామస్వామిగౌడ్, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ బేతి భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం నంగునూరు హైస్కూల్‌లో, మద్దూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు వేర్వేరుగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి



నర్సింలు(ఫైల్)

ములుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామ శివారులోని ఓ కంపెనీ సమీపంలో చోటుచేసుకుంది. సోమవారం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తానెదార్‌పల్లి గ్రామానికి చెందిన జామకాయల నర్సింలు(42) రెండు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం మండల పరిధిలోని సమీపంలోని ఓ కంపెనీ నిర్మాణంలో ఉన్న లిఫ్ట్ గుంతలో మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 22మంది పట్టుబడ్డారు. నిందితులను సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం రూ.36వేలు జరిమానా విధించారు.

రేషన్ బియ్యం పట్టివేత

అక్కన్నపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 7క్వింటాళ్ల రేషన్ బియ్యంను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బత్తుల అంకుస్ అనే వ్యక్తి గోవర్ధనగిరి గ్రామంలో పలువురు దగ్గర కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఓ ఇంట్లో నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారమందింది. ఈ మేరకు దాడి చేసి రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు పేకాడుతుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.15,580 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

హుస్నాబాద్ అంగడి వేలం వాయిదా

హుస్నాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన అంగడి వేలం వాయిదా పడింది. ఇందులో పాల్గొన్న కాంట్రాక్టర్లు వేలం పాటకు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ ప్రకటించారు. గత సంవత్సరం రూ. 1.20 కోట్లు అంగడి ఆదాయం రాగా ఈ సారి 5 శాతం ఎక్సెస్‌తో రూ. 1,26,27,300 నుంచి వేలం పాట ప్రారంభించగా ప్రస్తుతం అంగడి ఆదాయం అంత రావడంలేదని కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ వివరించారు. ఈ మేరకు వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన



జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

హుస్నాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. టెక్ జెనిక్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 60 మంది హాజరుకాగా 23 మందిని ఎంపిక చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ కొండా శ్యాంసుందర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, తిరుపతిరెడ్డి, మేకల వీరన్నయాదవ్, యాదవరెడ్డి తదితరులున్నారు.

చిన్నకిష్టాపూర్‌లో అలరించిన విద్యార్థులు



జడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కుకునూరుపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిన్నకిష్టాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 22 వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఫేర్‌వెల్ పార్టీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, బైరి మల్లేశం, సంతోష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విష్ణు, సోమీ కరుణాకర్, ఉపాధ్యాయులు గ్రామస్థులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వం



గుండారంలో ఎండిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పంటలు నీరందక ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని గుండారం గ్రామంలో ఎండిన వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట పొలాలకు సాగు నీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై రైతుల ఉసురు పోసుకుంటుందని విమర్శించారు.మేడిగడ్డ వద్ద గోదావరిలో పుష్కలంగా నీరున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని పంపింగ్ చేయడం లేదన్నారు. ఎండిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గ్రూప్-1, 2, 3 నియామకాలను నిలిపివేయాలి

గజ్వేల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు గ్రూప్-1, 2, 3 నియామకాలను వెంటనే నిలిపివేయాలని ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ కార్యాలయం ఎదుట నిరాహారదీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం అవిశ్రాంతంగా పోరాడి, వర్గీకరణ సాధ్యమవుతున్న తరుణంలో గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలు భర్తీ చేస్తే మాదిగలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. వర్గీకరణ జరిగిన అనంతరమే ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.